# బుచ్చిబాబు రేడియో నాటికలు

### డాక్టర్ మొదలి నాగభూషణ శర్మ

బుచ్చిబాబు బహుముఖ, ప్రజ్ఞావంతుడైన రచయిత – అని చెప్పడం చర్విత చర్వణం. నవల, కథ, గల్పిక, సాహిత్య విమర్శ, నాటకం, నాటిక – ఇలా. సాహిత్యరంగంలో ఆయన చేపట్టని ప్రక్రియ లేదు. చేపట్టిన ప్రక్రియను తనదైన ఒక వ్యక్తిత్వం రూపుకట్టేలా "తీర్చిదిద్దని రచనా లేదు".

వేసవి కాలం పిల్ల తెమ్మెరల్లో తేలిపోయినట్టు అలాగ్గా అలరించే అనితరసాధ్యమైన ఆయన హాస్యపు జల్లులూ, అంతలోనే జీవిత సత్యాన్నంతా మధించి, రంగరించి, గుళికల్లో పాఠకుడికి అంద చెయ్యాలని తహతహలాడే తాత్త్విక హేలలూ – హాస్యాన్ని సంతరించడంలో ఆవేశం, దాని వెనుక ఇమిడి వున్న అంతరార్థాన్ని తెలియ చెప్పేటప్పుడు సంయమనం – ఇదీ రచయితగా బుచ్చిబాబు వ్యక్తిత్వం.

రాసిన ప్రతి రచనలోనూ ఏదో ఒక కొత్తదనాన్ని చూపిన భావుకుడాయిన, తాను స్వాతంత్రోద్యమ, ప్రజాస్వామ్య వాతావరణంలో పెరిగినా, తన భావనకు మొలకలు తొడిగిన రసపిపాసి. చివరకు మిగిలేదిలో, అసంఖ్యాకాలైన కథల్లో – చివరకు నాటకాల్లో, నాటికల్లో కూడా ఈ కాల్పనిక కోద్యమ భావతరంగాలే మనకు అడుగడుగునా ప్రత్యక్షమవుతాయి.

బుచ్చిబాబు రంగస్థలం నాటకాలకన్నా రేడియో నాటకాలనే ఎక్కువగా వ్రాశాడు. ఆయనకు రేడియోతో ఉన్న సంబంధం దీనికి కారణం కావచ్చు. అంతకన్న ఎక్కువగా – ఆ ప్రక్రియలో వుండే విస్తృతి ఆయనను ఆకట్టుకుని వుండవచ్చు.

రంగస్థల నాటకానికి శ్రవ్య నాటకాల కన్నా రచనా సౌలభ్యం ఎక్కువ. కాని శ్రవ్య నాటికా ప్రక్రియకు అలవాటు పడినవారు, ముఖ్యంగా అటువంటి నాటికలకు అసంఖ్యాకంగా దర్శకత్వం వహించిన బుచ్చిబాబు వంటి వారు ఆ మాధ్యమంలో రచనలు సాగించడంలో ఆశ్చర్యం లేదు. తెలుగులో రేడియో నాటికలకు సాహిత్య గౌరవాన్ని సంతరించిపెట్టిన మధ్యకాలం రచయితల్లో గోరాశాస్త్రి, కుటుంబరావు, గోపీచంద్, బుచ్చిబాబులు ముఖ్యులు. వీరిలో ఒక్కొక్కరిది ఒక్కొక్క రచనా విధానం; ఒక్కొక్కరిది ఒక్కొక్క శైలి. బుచ్చిబాబులో intellectual orientation – మేధా సంబద్ధమైన భావనా పటిమ హెచ్చు.

రంగస్థలం నాటకంలోవలె కాక రేడియో నాటకంలో వాచిక విన్యాసానికే ప్రముఖమైన స్థానం. శబ్దానికి ఎంత నాటకీయత వుందో శ్రవ్య నాటికను గమనిస్తే తెలుస్తుంది. పాత్రల వ్యత్యాసాన్ని దృశ్యమానం కావలసిన సంక్లిష్ట సంఘటనలనీ. చివరకు పరాకాష్టనీ కూడా శబ్దమే వ్యక్తీకరించాలి. "మనిషి ఆకృతిని, రూపురేఖల్ని చిత్రించడానికి అతడి మాటలను మించిన ఆయుధం వేదం" అంటాడు ఒక విమర్శకుడు. శ్రవ్య నాటికలో

శబ్దం చూపగల అన్ని వైవిధ్యాలనీ బుచ్చిబాబు రేడియో నాటికల్లో మనం చూడగలం.

బుచ్చిబాబు నాటికలు చాలా వరకు రేడియో ప్రసారితాలే! ఆత్మవంచన, గొలుసు వంటి రంగస్థలానికి అనువైన నాటకాలు కూడా శ్రవ్య నాటికలుగా ఎంతో ఆదరం పొందాయి. ఉత్తమ యిల్లాలు, ఆద్యంతాలు–మధ్యరాధ వంటివి కేవలం శ్రవ్య నాటికలే! వీని అన్నింటినీ ఇతివృత్తం దృష్ట్యా పరిశీలిస్తే వీటిని స్థూలంగా మూడు రకాలుగా విభజించవచ్చు; చారిత్రకాలు, సామాజికాలు, కాల్పనికాలు – అని. ఆయన రచనా వ్యాసంగం – ముందు చారిత్రకాలతో మొదలు పెట్టి, సామాజికాల వైపుకు సాగి, కాల్పనికాలలో పరాకాష్టను చేరుకున్నదని చెప్పవచ్చు.

తిష్యరక్షిత, రాయల కరుణ కృత్యం, ఒమర్ ఖయ్యాం – బుచ్చిబాబు చారిత్రక నాటికలు. మామూలుగా చారిత్రక నాటకంలో ఒక చారిత్రక సన్నివేశాన్ని దృశ్యమానం చేయడమో, ఒక ప్రసిద్ధ చారిత్రక పురుషుడి జీవితాన్ని చిత్రించడమో జరుగుతుంది. కాని యీ చారిత్రక నాటికల్లో – ఒక చారిత్రక వ్యక్తి చిత్రణలో మన ఊహకందని ఒక కొత్త వ్యక్తిత్వాన్ని మనకు చూపడం – బుచ్చిబాబు రచనా చమత్కృతి.

తిష్య రక్షిత తిరస్కృత భర్తృక. ఆమెను ప్రేమించిన వారూ, ఆమె ప్రేమించిన వారూ అందరూ బౌద్ధమతం ఆకాంక్షలో మునిగిపోయి ఆమె ఆకాంక్షలను తీర్చని వారే! చివరకు భర్త అశోకుడు కూడా – భౌతికమైన ప్రేమకూ – మతం నిర్దేశించిన నైతిక విలువలకఉ మధ్య జరిగే పోరాటాన్ని హృద్యంగా చిత్రించాడు రచయిత. అలాగే 'రాయల కరుణకృత్యం'లో కూడా. రాణివాసంలో మగవారికి దూరంగా వుండవలసిన 'స్వరూపిణి' అన్న రాణిగారి చెలికత్తె చిన్ననాటి స్నేహితుణ్ణి కలుసుకుంది. పరస్పరం ప్రేమను వెల్లడించుకున్నారు. కాని ఇంతలో రాయలవారు వచ్చారు. ఆమె అతనికి విషం యిచ్చి తాగమంటుంది. పడివున్న అతన్ని చూచి, రాయల సంగతి గ్రహించి, వారిద్దరికీ స్వేచ్ఛనించి పంపుతాడు. చరిత్రలో కనిపించే రాయలు కాదీయన; రాయల వ్యక్తిత్వంలో మనకు తెలియని ఒక అంశాన్ని ఈ నాటిక ప్రస్ఫుటం చేస్తుంది.

ఈ చారిత్రక నాటికల్లో – నిజానికి బుచ్చిబాబు అన్ని నాటికలలోను – విభిన్న వాతావరణంలో పెరిగిన, విభిన్న మనస్తత్వాలు, విలువలు కలిగిన వ్యక్తులలో ఉండే అసంతృప్తి దాన్ని అధిగమించడానికి వారు పడే మధన – కథా వస్తువు అనొచ్చు. ఇది దైహికమైన, బాహిరమైన ప్రేమతో ప్రారంభమై, మానసికమైన భావనా జ్వలితమైన ఆవేదనగా రూపొంది, చివరకు తాత్త్వికత వైపుకు పయనిస్తుంది బుచ్చిబాబు రచనల్లో.

చారిత్రక నాటికల్లో ఈ మధన, యీ ఆర్తి – ప్రేమకీ దానికి వ్యతిరిక్తమైన సాంఘిక వాతావరణానికి మధ్య జరిగిన సంఘర్షణ వల్ల ఉత్పన్నమవుతుంది. ఈ నాటికల్లోని ప్రతి పాత్రలోను ఒక విధమైన అసంతృప్తి, ఆ అసంతృప్తికి కారణమైన ఒక ఉద్విగ్న మానసికోత్తేజ, కనిపిస్తూ వుంటాయి. తాను ఉంటున్న వాతావరణంలో ఇమడలేక ఉక్కిరిబిక్కిరౌతున్న వ్యధిత జీవుల మానసిక స్పందనే యీ నాటికల సంఘర్షణకి తీక్ష్ణతనీ, పాత్రల ఆవేదనలకు ఆర్ద్రతనీ సంపాదించిపెట్టాయి.

ఈ ఆంతరమైన అసంతృప్తినీ, ఆంతరమైర వేదననీ – రాయలు ఇలా వ్యక్తం చేస్తాడు – స్వరూపిణితో:

> ఇది చీకటి గుహనీ, బందికానా అని ఏదో గొణిగావు. నీకొక్క దానికే కాదు యీ బందికానా! ఈ సంకెళ్ళు! మనందరం జీవితంలో బంధితులమే. కిరీటంనన్నూ, తీరని వాంఛ నిన్నూ, ఆకృతి రాళ్ళనీ, చీకటి వెలుగునీ, హృదయం ప్రేమనీ, మేఘం వర్షపు చుక్కనీ, ప్రియురాలు భార్యనీ బంధించి వేశాయి. అన్నీ సంకెళ్ళే కాని ఇవి చప్పుడు చెయ్యకూడదు. ఆ బాధ్యత మాత్రం మనది. నాదీ – నీదీ!

ఈ చప్పుడు చెయ్యని సంకెళ్ళే – యీ వెలువరించరాని మనో వేదనే బుచ్చిబాబు పాత్రల సంఘర్షణకు మూలకందం. సామాజిక నాటికల్లో కూడా మానసిక సంఘర్షణకే ప్రాముఖ్యం ఇచ్చాడు బుచ్చిబాబు. ఆయనను కదిలించినవి, కదిలించి, ఆయనలోని రచయితను ప్రశ్నించి, వాటికి సమాధానాలను వెదకమని అన్వేషిగా ఆయనను చేసినవీ – వైయక్తిక సమస్యలే! ఆ అన్వేషణే బుచ్చిబాబు సృజనాత్మకతకి మూల ప్రేరణ. సమస్యా నాటకాలుగా వ్రాసిన 'గొలుసు' వంటి రచనల్లో కూడా వ్యక్తుల మానసిక సంఘర్షణే ప్రముఖంగా కనిపిస్తుంది.

బుచ్చిబాబు చిత్రించిన ఈ వైయక్తిక సమస్యలు చాలవరకు ఒక వ్యక్తి లేదా వ్యక్తులు తమకు అనువగాని సామాజిక వాతావరణంలో ఇమడలేక విలవిల లాడి పోవడాన్ని చిత్రించేవే! ఆత్మవంచనతో రాజశేఖరం విషాదాం జీవితం దీనికి ప్రతీకగా చెప్పుకోవచ్చు. తరతమ భేదాలు మిధ్యా గౌరవాన్ని సృష్టిస్తున్నంత కాలం యీ విషాదమైన అంతం తప్పదు. ఒక వ్యక్తి జీవితాన్ని ఆలంబనంగా చేసుకుని సమాజంలో ఉన్న చెడు మీద వ్యాఖ్యానం చెయ్యడం యీ నాటికల్లో బుచ్చిబాబు చూపిన రచనా విధానం. ఈ విధానం అటు ఆత్మవంచన వంటి విషాద రూపకాలలోను, షష్టిపూర్తి, కార్యదర్శి కల్యాణి వంటి – ఆహ్లాద రూపకాల్లోను కూడా మనం చూడొచ్చు. ఆయన సృష్టించిన కామెడీలో సన్నివేశం కన్న సంభాషణ బలమైంది. మాటకు మాట – అలవోకగా అల్లుకుపోయే సంభాషణ చాతుర్యం. ఆ మాటల వైవిధ్యంలోనే సంఘర్షణ; అందులో ఒదిగి పోయిన పాత్రల నైశిత్యం; ఆ నైశిత్యాన్ని ఛేదించే హాస్యం – ఇది ఆయన నాటికల్లో కనిపించే రచనా విధానం.

షష్టిపూర్తి చేసుకుంటున్న సదాశివుడిగారి యింటిలో ఆయన కూతుళ్లు, అల్లుళ్ళు, కొడుకులు, కోడళ్ళు కోరికల గుర్రాల మీద చిత్రవిచిత్రంగా కదను తొక్కడం – యీ నాటికకు స్ఫూర్తిని ఇచ్చిన ఇతివృత్తం. స్వార్థ, నిస్వార్థాల మధ్య చెదిరిపోయిన సదాశివుడుగారి ..............తిరిగి పునరావిష్కృతం కావడంతో నాటిక ముగుస్తుంది. ఇందులో నాటిక ఆసాంతం అసలు నాయకుడు సదాశివుడుగారు ఒక్కసారి కూడా కనిపించక పోవడం – రచయిత గడుసుదనానికి నిదర్శనం.

ఈ నాటికల్లో అసలుసిసలైన శ్రవ్య నాటికగుచ్ఛం "ఆద్యంతాలు–మధ్య రాధ" ఇందులో పన్నెండు ఘట్టాలు. మధ్య తరగతి జీవితాన్ని చిత్రిస్తాయి. దైనందిన జీవితంలో కనిపించే సారస్యాన్ని ప్రదర్శించడం వీటి

ఉద్దేశ్యం. "ఈ రకం రచన నాటిక కాదు; కథ కాదు. కాస్తంత అదీ, కాస్తంత ఇదీ కలిసి ఉన్న రేడియో రూపకం" అంటాడు రచయిత. ఇందులో మామూలుగా విజయవంతం అయ్యే రేడియో నాటికల లక్షణం – ఒక ............కథకుణ్ణి ప్రయుక్తం చేయడం. ఈ కథకురాలు రాధే ఒక పాత్రగా మనముందు సాక్షాత్కరించడం అటువంటి పాత్ర దృష్టి కోణం నుంచి సంసారంలో జరిగే సన్నివేశాలను చిత్రీకరించడం చూస్తే – రాధవంటి విద్యావతి, సంస్కారవతి, సంభాషణా చాతుర్యం కలిగిన, నిత్య జీవితంలో ఉండే వదినా మరదళ్ళ హాస్యాన్ని పొదిలి పుచ్చుకున్న తెలివి గల మధ్య తరగతి యువతి – అంటే బుచ్చిబాబుకున్న ప్రత్యేకమైన ఆప్యాయత వెల్లడి అవుతుంది.

ఒక మూడవ పద్ధతికి చెందినవి కాల్పనిక నాటకాలు, నాటికలు. ఊహాజనితమైన కథాకల్పన ఒక విచిత్రమైన చిత్తవృత్తి ఆలంబనంగా సంభావ్యత, అసంభావ్యతతో నిమిత్తం లేకుండా ఒక భావ వీచికను ప్రస్ఫుటీకరించే యీ కోవకు చెందినవి. "ఉత్తమ యిల్లాలు" ఇటువంటి నాటికల్లో మేలి రచన. నండూరి సుబ్బారావుగారి ఎంకిని కథానాయికగా చేసి – ఆమెను అధునాతన జీవితం మధ్యలో మాసిపోని మాణిక్యంగా ఊహ చేసి, ప్రాణం పోశాడు రచయిత.

ఈ కాల్పనిక నాటికల్లో – ఒకే నిద్ర – ఎన్నో కలలు, గాజుమేడ, అంతిమ అజ్ఞానం, నాలుగో పరిమాణం – మొదలైన వానిలో – తార్కిక లక్షణాలు ఎక్కువ. సంభాషణలన్నీ ఊహాజనితాలు. వీనిలో లోపించిన నాటకీయతను, తార్కికన బద్ధద సంభాషణలు ఆ సంభాషణలతో తీర్చిదిద్దిన హాస్యం – పూర్తి స్థాయి అనుకోవచ్చు.

కలలు నింపుకున్న జీవితాలు, ఆ కలల అసంభావ్య, అస్తవ్యస్త ధోరణి, ఆ కలలు పునాదుల మీద నిర్మించుకునే ఊహాసౌధాలు; ఆ ఊహా సౌధాలు కూలినప్పుడు అయ్యే చప్పుళ్ళ రోదనలు – ఇదీ వీనిలో కనిపించే జీవితం. సర్రియలిజం–రియలిజంల మధ్య ఊగిసలాడే బతుకురొదకు చిత్రీకరణ.

ఈ నాటికలకు బలం – వానిలో బుచ్చిబాబు చూపే తార్కిక దృష్టి. అయితే యీ తార్కిక దృక్పథం ఆయన్ను మనుషులకు దూరం చేసి వేదాంతిగా మార్చకుండా, మనుషుల మధ్యనే, వారి సమస్యల చిత్రీకరణతోనే నిలదీసిన రచయితగానే ఉంచింది. అందుకే ఎంతటి తాత్త్విక సిద్ధాంతాన్నయినా నవ్వుల మల్లెగొంతరల మీద అలవోకగా నడిపించగలడాయన.

ఆయన ఇంగ్లీషులో ఆలోచించి, తెలుగులో వ్రాస్తాడని బుచ్చిబాబు మీద ఒక అపప్రధ చాలాకాలం ప్రచారంలో ఉంది. అది ఆయన పాశ్చాత్య సాహిత్యంలో నిష్ణాతుడు కావడం వల్ల వచ్చిన అపప్రధ అనవచ్చు. ప్రతి రచయితా తన కథను, తన భావ శబలతకీ తగిన శైలిని సమకూర్చుకుంటాడు. బుచ్చిబాబు చేసింది అదే! వైయక్తిక మానసిక సంఘర్షణని సైద్ధాంతిక పరంగా చూపించాలని ఆయన ఆవేదన. అందులో మేధావులు చూడవలసిన తాత్త్విక దృష్టినీ, మామూలు పాఠకుడు చూడగలిగిన హాస్యదృష్టినీ మేళవించాడు. అయితే శ్రవ్య

నాటికలో ఇంత జటిలత కూడదు అని కొందరు వితర్కించవచ్చు. అక్కడే ఆయన సంభాషణల్లోని హాస్యం ఆయనకు ఆలంబనం అయింది.

ఆయన సృష్టించిన హాస్యం దాన్ని ఆలంబనంగా చేసుకుని ఆయన కూర్చిన సంభాషణలు, అందులోని శబ్ద చాతురి – అని మామూలు పాఠకుణ్ణి తేలికగా ఆకట్టుకుంటాయి. అంతకు మించి ఆ శబ్ద చాతుర్యం వెనుక, ఆ హాస్యపు సంభాషణల పకపకల వెనక, అసలు బుచ్చిబాబు ఉన్నాడు. ఆయన తార్కికుడు, తత్త్వవేత్త, అన్వేషిగా తాను గమనించిన జీవిత సత్యాన్ని నలుగురికీ పంచాలన్న తార్కికుడైన రచయిత – బుచ్చిబాబులోని బుచ్చిబాబు ఉన్నాడు. ఆయన్ని చదివితేనే బుచ్చిబాబు చదివినట్టు. ఆయన మనకు కనిపించే ప్రపంచం చాటుగా ఉన్న ప్రపంచాన్ని తన కావ్య జగత్తుగా అందించారు. భావనా బలాన్ని హర్షించే పాఠకులకి ఆయన కావ్యజగత్తు కొత్త కొత్త అనుభవాల వినూత్న జగత్తును ఆవిష్కరింప చేస్తుంది.